# రామ్మూర్తి పెళ్ళయింది!






## రావి కొండల రావు

బస్సుకోసం పడిగాపులు కాస్తూ ఫర్లాంగున్నర పైచి
లుకున నించున్న క్యూలో చిట్టచివర వచ్చి చేరిన వసంత, కొంత సేపటికి మధ్య కొచ్చి - వెనక్కు తిరిగి చూసుకుని ''పూర్వకాలం'' నాటి తన స్థానాన్ని తలచుకుని, తను ఎంత ముందు కొచ్చిందో వూహించుకొని, ''ఓయబ్బో'' అ
నిట్టూర్చి ముందు నడక సాగించింది. ఈ లోపల వచ్చే బస్సులు వస్తున్నాయి - అట్లాగే పోతున్నాయి.ఎక్కుతున్నవా

ఎక్కుతున్నారు - మిగతావాళ్ల క్యూలో పడి కొట్టుకుంటున్నారు. వసంత వెనక్కు తిరిగి చూసుకోవటంలో, ఆరు శాల్తీలకు వెనక నున్న తాజా యువకరత్నం ఒకడు-తన కోసమే కాబోలు ఆ చూపు అనుకొని, మృదువుగా కాలరు నిమురుకున్నాడు.

క్యూలోని జనాభాలో కొందరు అక్కడే కూలబడుతున్నారు. మరి కొందరు కాళ్ళు నొక్కుకుంటున్నారు. ఒకాయన ఆ క్యూలో నించునే, శరత్‌బాబు పెద్ద నవల పూర్తిచేసి, పుస్తకం ముడిచి- మరో పుస్తకం వుంటే బాగుండును అని తలపోశాడు. ఒకడు. లెక్కవేసుకొన్న ప్రకారం ఇరవైనాలుగు సిగరెట్లు కాల్చాడుట. కొందరు స్టూడెంట్లు క్యూలో నడుస్తూనే పాఠాలు కంఠతా పడు తున్నారు. వసంత ఇవేమీ చెయ్యకుండా అటూ ఇటూ వున్న పరిసరాలను మాత్రం చూడసాగింది. “ఈ ప్రక్క మేడ ఎంతసేపని చూడను?'' అని విసుక్కున్నది కూడా. ఆమెకు ఆరుగురి వెనకనున్న ఆ యౌవనుడు-ఆమె వెనక్కు వచ్చి చేరాలని-మహ ఉవ్విళ్ళూరిపోతున్నాడు.

బస్సుల రాకడా. అసువుల పోకడా తెలియవని పెద్దలంటారు. అందువల్ల పెద్దల వాక్కును జవదాటని ఇంకో బస్సు-ఎట్టకేలకు తెలియకుండా, ఛట్టునవచ్చి నించుంది. సాగుతున్న చీమలబారు దగ్గర కొత్తవూదితే, బారు చెదిరి అటూ ఇటూ పోయినట్టుగా-బస్సు ఆగగానే ఈ “బారు” కూడా చిందరవందరై తోపులాటలూ, హడావుడులతో బస్సు ద్వారం ముందు ముద్దగా మూగింది. ఆ ముద్దంతా మగ ముద్ద. ముగ్ధలంతా వెనక్కు వుండిపోయారు. ఒకడినో, అరనో సేకరించుకుని - మిగతా వాళ్ళను వాళ్ళ ఖర్మకు వదిలి-మంత్రిగారి బావమరదల్లే పోజిచ్చి-బస్సు సాగిపోయింది. మళ్ళీ క్యూ-క్యూలో వసంతా,-ఇందాక ఆరుగురి వెనక కాలరు నిమురుతూ నించున్న కుర్రాడు ఈసారి ఆమె వెనకగా-తయారయినాడు.

“ఇట్లా ఐతే ఎట్లా?” అన్నది వసంత లోలో. తనూ మగవారిలాగానే ముందంజ వెయ్యాలి. దేశనాయకులూ పెద్దలూ సమాన హక్కులంటున్నారు. అకండక్టరేదో కాటుకాబొట్టు పెట్టి తనను ఆహ్వానిస్తాడని తను కూచుంటే-అదే నించుంటే-అయ్యే పనికాదు. తను కూడా సాహసం ప్రదర్శించాలి. వసంతను వెంబడిస్తున్న యువకరత్నం ఆమె జడలోని పూవులను పట్టిగ్గా వాసన చూడబోయి, టక్కున తగ్గాడు. వసంత ఇవేమీ పట్టించుకోలేదు-ఆమె ధ్యానం అంతా అప్పుడు బస్సు మీదే వుంది.

కొంత కాలానికి మరో బస్సు వచ్చింది. వసంత తెగించింది. మగవారి సందర్శి ఛేదించుకొంటూ, మగతనం ప్రదర్శిస్తూ జబర్దస్తీగా బస్సులో జొరబడింది. “లేకపోతేటా-'' అనుకొంది నిట్టూరుస్తూ. ఆడది కూడా మగాడిలాగా తయారైతేనే కాని మగవాళ్ళు లొంగరు, అని సిద్ధాంతీకరించు కున్నది.

స్టాపులోంచి బస్సు కదిలిపోయింది. వసంత వెనకాలేవుండి, స్వప్న సీమలో విహరిస్తున్న ఆ హీరో ట్రాజిడీలోపడి. “నన్నొక్కణ్ణి...ననొక్క...ణ్ణి'' అని బస్సుతో మొరపెట్టుకున్నాడు. ఆ మొరను కాస్తకూడా ఖాతరు చెయ్యకుండా ఆ శకటం ముందు బర్రుమని, వెంటనే తుర్రుమంది.

వసంతకు బస్సులో నించోటానికి కూడా స్థలం కరువైంది. ఏదో విధంగా సర్దుకుని-నించుంది. ఆమె నించున్న ప్రక్కనే వున్న సీటులో కూచుని వున్న రామ్మూర్తి-“స్త్రీలను గౌరవించవలెను'' అనే పెద్దల వాక్యాన్ని స్ఫురణకు తెచ్చుకుని - లేచి, ఆమెను కూచో మన్నాడు.

“థాంక్స్'' అన్న దామె - కూచోకుండానే.

“ప్లీజ్ సిడవున్'' అన్నాడు రామ్మూర్తి ఆంగ్లంలో మరింత మర్యాదగా, ఆమెను చూసి.

ఈసారి ఆమె, రామ్మూర్తి ముఖాన్ని చూస్తూనే సీటులో కూలబడింది, ఆమె పెదవులేవో “థాంక్స్'' అన్నట్టుగా కదిలాయి. వసంత వీక్షణాలు రామ్మూర్తి మీదపడ్డాయి. “ఎంత మంచి హృదయం! మగాళ్ళలా కాదు. అసలు మగాళ్ళ పోలికలే లేవు పాపం! ఎంత ఆదరణ, ఎంత గౌరవం'' అనుకొన్నది వసంత రామ్మూర్తిని మెచ్చుకుంటూ. కాస్సేపటికి ఆమె - రామ్మూర్తి అందాన్ని కూడా మెచ్చుకుంటూ - “ఎంత బావున్నాడు'' అనుకుంది. ఐతే వసంత గురించి రామ్మూర్తి ఏ అభిప్రాయమూ వెలిబుచ్చుకోలేదు. అతని దృష్టి ఇంకెక్కడో వుంది.

సీటు ప్రక్కగా నించున్న రామ్మూర్తికి తగిలేట్టుగా వసంత చెయ్యి విసిరింది. ఒళ్ళు ఝల్లు మన్నది. “ఎంత మంచి ఝల్లు'' అనుకుంది పారవశ్యంలో. “తొలి చూపులోనే యితన్ని నేను వలచానా” అన్నది వసంత స్వగతాన,

కొంతసేపటికి రామ్మూర్తి బస్సు దిగే ప్రయత్నం చేశాడు. వసంత ఛట్టున కళ్ళు తెరిచి చూడగా - తాను దిగాల్సిన స్టాపుకు మూడు స్టాపులు ముందు కొచ్చింది. “అరెరె” అనుకొని, తొందరగా ఆమె కూడా అతని వెనకాలే బస్సు దిగింది. బస్సు వెళ్ళిపోగానే తల వంచుకుని వెళ్లిపోతున్న రామ్మూర్తిని చూసి - “ఇదిగో చూడండి'' అన్నది వసంత.

రామ్మూర్తి చూశాడు.

“మీ ఉపకారానికి చాలా కృతజ్ఞతలండీ” అన్నదామె.

“దేనికి? ... ఓహో... అదా... దానికేం...'' అని రామ్మూర్తి పోబోయాడు.

“చూడండి'' అంది వసంత.

“ఇందాక చూశాగా''



*అసలు సిసలు సంగీత ప్రియుడు: అందమైన అమ్మాయి స్నానాల గదిలో నీళ్ళోసుకుంటూ జోరుగా పాటలు పాడేస్తుంటేతలుపు కన్నం వద్ద చెవిపెట్టి అనందించేవాడు.*

"అది కాదు - మీ రెంత మంచివారు! మీకు నా కృతజ్ఞతలు."

"చెప్పా రా మాట" అని రామ్మూర్తి సాగిపోయాడు.

"చూడండి" అన్నది వసంత మళ్ళీ.

ఈ సారి రామ్మూర్తికి కోపం వచ్చింది. "ఏమిటది చెబుతూవుంటే - మీ వేషాలు నా దగ్గిర సాగవు" అన్నాడు గట్టిగా.

"నేనేం వేషం వేశానండీ -" అన్నది భయంగా.

"నాకు తెలుసు. ఇట్లా నా వెంటపడి, నన్ను వలలో వేసుకోవాలని మీ ప్రయత్నం. ఇక్కడవేం సాగవు. జాగ్రత్త. ఇంకా వెంటాడారంటే, మా నాన్నగారితో చెప్పి.."

"క్షమించండి. మీకు చాలా కష్టం కలిగించాను. మీకు అభ్యంతరం లేకపోతే - మీ పేరు చెబుతారూ?"

"రామ్మూర్తి!" అన్నాడు రామ్మూర్తి కోపంగా, కుండ బ్రద్దలుకొట్టినట్టు.

"రామ్మూర్తి! ఎంత చక్కని పేరు... మరి మీ యిల్లు..."

ఈ సారి రామ్మూర్తి మండిపోయాడు. "చెబుతూంటే వినిపించుకోకుండా నడి వీధిలో ఈ అల్లరేమిటి? వెళ్ళండి... అదే మా యిల్లు..." అని చరచరా వెళ్ళి ఇంట్లో దూరి, రామ్మూర్తి తలుపు గడియ వేసేశాడు.

ఆ తలుపులకేసి చూస్తూ వసంత వది సార్లు కనురెప్పను విదిలించి, తీయని బాధతో విట్టూర్చింది.

"నువ్వు ఇంకా భోజనానికి రావా వసంతా" అని పలకరించింది ఆమె హాస్టల్ రూమ్ మేటు సరళ. వసంత సమాధానం చెప్పలేదు. పక్కమీద శయనించి దిండుకింద తలదూర్చుకుని బొమ్మల్లే పడి వున్నది.

"ఏం వసంతా - ఏమి టిది?" అన్నది సరళ మళ్ళీ.

వసంత వినిపించుకోలేదు - కదలలేదు. మెదలలేదు.

సరళకు ముచ్చెమటలూ పోశాయి. "ఆడపిల్లల హాస్టల్లో విద్యార్థిని దుర్మరణం - హత్యో, ఆత్మహత్యో తేలక పోలీసులు మథనపడ్డ వైనం" అని న్యూసు హెడ్డింగు వూహించుకొన్నది. సరళకు ఇంక కాళ్ళు స్వాధీనంలో లేవు. "ఓ విమలా, కమలా.. పద్మా... సీతా... లక్ష్మీ... జగదాంబా... మృణాళినీ... సత్యభామా..." అంటూ ఎలుగెత్తి అరవసాగింది - అరణ్య మధ్యంలోని ఆర్తనాదంలాగా.

ఈ దెబ్బకుగాని వసంత మేలుకోలేదు. ఆమె ఛట్టున లేచి కూచుని, "ఏమి టా గావు కేకలు?" అని అరిచింది.

"అమ్మయ్య-నువ్వు బ్రతికే వున్నావా-గుండె అదిరిపోయింది. అందుకని..."

"అట్లా కాకిలా అరిచావు"

ఇంతలో ఇందాకటి నామదేయాలన్నీ వరసక్రమంలో అక్కడికి పరుగెత్తాయి- "ఏమిటి...ఏమిటి...ఏం జరిగింది?"... అంటూ.



"ఏమీ లేదు. మీరంతా వెళ్ళండి. ఈ సరళ పట్టి దొంగ రాస్కెల్" అన్నది వసంత కూచుంటూ.

"అసలు జరిగిం దేమిటి వసంతా?" అని అడిగింది సత్యభామ.

"నథింగ్. మీరంతా వెళ్ళండి..వెళ్ళండి.. వెళ్ళరేం!"

వసంతకు పిచ్చో పిశాచమో పట్టిందని ఆ భామలంతా బయటకు పరుగెత్తారు.

వసంత తలుపు గడియ వేసేసింది.

"అయ్యో - నే నుండిపోయాను. నన్ను కూడా పోనీ" అన్నది సరళ భయంగా.

"నువ్వుండు సరళా...సరళా! నాకు నువ్వు ఒక మహోపకారం చెయ్యాలి... ఇలా కూచో... సరసన కూచో... నా హృదయ స్పందనం నీకు వినిపిస్తోందా? వినిపించదు. అసలు, హృదయం అక్కడుంటేగా-అ దెప్పుడో తస్కరించబడ్డది. ఆ యువకు డెవరో...ఏమిటో...ఆ నల్లని కురులు ... తెల్లని పలువరస ... చల్లని చూపులు...మెల్లని నడకా..."

"ఐ సీ! ఇదన్నమాట నీ పిచ్చి! ఇంతకూ ఎవరా నాయక శిఖామణి? నాతో చెప్పు-చెయ్యగలిగిందేమన్నావుంటే చేస్తాను"

"హుఁ! నీవల్ల కాదు. ఐనా నువ్వు చెయ్యగలవనే ధైర్యం నాకుంది. ఎట్లాగైనా సరళా! నువ్వు నన్ను కాపాడాలి."

"ఇంతకూ ఆ హీరో ఎవరంటే?"

"ఆయన పేరు...పేరు...అబ్బ చెప్పలేను"

"సరే, నే వెళ్తాలే. పిచ్చాసుపత్రిలో బెడ్ రిజర్వు చెయ్యాలి"



సలభై ఐదేళ్ళు పైబడ్డ ఒహాయన రాత్రి పడుకో బోయేటప్పుడు "నవజీవన యవ్వన గుళికలు" అబగా ఓవర్ డోస్ పుచ్చేసుకున్నాడు. తెల్లారాక భార్య లేపగా లేపగా చివరికి మేలుకున్నాడు.

"అబ్బ, ఏంటే అప్పుడే నిద్దర్లేపుతావు, నే నివాళ బడికెళ్ళను" అని గారాలు పోయాడు.

---

"ఆఁ ఆఁ...వుండుండు. ఆయన పేరు రామ్మూర్తి!" అని ఛట్టున చెప్పింది వసంత-ఆకాశమంత సిగ్గుపడిపోతూ.

"ఐతే ఆయనా నువ్వు ప్రేమించుకొని ఎన్నాళ్ళయింది?"

"ఎన్నాళ్ళో ఐతే ఇంకా ఇట్లా జీవించి వుండేదాన్నా? ఈ రోజే"

"తాజా ప్రేమా! అందుకనే వేడి ఎక్కువగా వుంది" అని తన ధోరణిలో సరళ జోక్ వేసింది. -

ఆ తర్వాత వసంత సరళను ప్రక్కన కూచోబెట్టుకుని, చాలా తియ్యని కబుర్లు చెప్పింది. రామ్మూర్తి, తనూ ఎట్లా కలుసుకున్నారో - అతని మాటల ధోరణీ-అతని ఇల్లూ ఇవన్నీ చెప్పింది. "నీ ప్రాణం పోయినా సరే, నా ప్రాణం కాపాడాలి" అని కూడా చెప్పింది. చేతనైనంత సహాయం చేస్తాను. ముందు భోజనానికిలెమ్మంది సరళ.

సరళ రామ్మూర్తి ఇంటి ముందు నించుని "ఇది రామ్మూర్తిగారి ఇల్లేనా?" అని అడిగింది గట్టిగా. ఎవరూ

సమాధానం చెప్పలేదు. అదే ముక్క మళ్ళీ అంది-మరింత గట్టిగా. ఓ యువకుడు వచ్చాడు-అమ్మాయి తమ ఇంటి ముం దేమి టని ఆశ్చర్యపోతూ.

'నమస్కారం రామ్మూర్తిగారూ! నేను మీతో పనివుండి వచ్చాను" అన్నది సరళ.

"నేను రామ్మూర్తిని కాను. లక్ష్మణ రావును. మీ పనేమిటో నాతో చెప్పండి" అన్నా డా యువకుడు సరళ వేపు ఓరగా చూస్తూ.

"రామ్మూర్తిగారు లేరా?"

"వస్తారు. మీ రిట్లా వచ్చి కూచోండి" అని లక్ష్మణరావు సరళను లోపలకు ఆహ్వానించాడు. సరళ పెద్ద చిక్కులో పడింది. తనేమో, వసంత ప్రేమ వ్యవహారంలో రామ్మూర్తికోసం వస్తే-మధ్య ఈ లక్ష్మణ రా వెవడో తనమీద దృష్టి సారిస్తాడు. ఈ ప్రేమలు ఇట్లాగే ప్రారంభ మవుతాయి- వీటికి అర్థం లేదు, అని విసుక్కుంది. తన మీది ప్రేమతో ఈ లక్ష్మణరావు కూడా ఎవర్నయినా తన దగ్గరకు పంపుతాడా-తనను వసంత పంపినట్టు! "రామ్మూర్తితో మీకు ఏపాటి పరిచయం?... మీ విషయం ఎప్పుడూ వాడు నా దగ్గర ప్రస్తావించలేదే! ఐనా, పైకి నంగిలా నటిస్తాడు గాని-వెధవ అసాధ్యుడు లెండి. అంటే-ఈ విషయంవల్ల తేలుతోంది. మీ పేరు?... పోనీలెండి. పేరులో ఏ ముంది? నేను రామ్మూర్తి కజి న్ను. వాడి తండ్రి, మా నాన్నా పెద్ద తండ్రి పినతండ్రి పిల్లలు. నా కన్నీ మా నాన్న పోలిక లొచ్చాయి. ఆయన మహ గట్టి వాడు..." ఈ ధోరణిలో ఆ కుర్రాడు ఉపన్యాసం దంచుకుంటూ పోసాగాడు. సరళ దేనికీ సమాధానం ఇవ్వలేదు. ఆమె రామ్మూర్తికోసం నిరీక్షించసాగింది.

కాస్సేపటికి రామ్మూర్తి వచ్చాడు. అతన్ని చూడగానే లక్ష్మణరావు తగ్గాడు. ఐతే రామ్మూర్తి సరళను గాని-సరళ రామ్మూర్తినిగాని పలకరించుకోక పోవడం వల్ల - అతనే కలిగించుకుని "ఇతనే రామ్మూర్తి" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

సరళ లేచి నమస్కరించింది.

"ఎవరికోసం?" అన్నాడు రామ్మూర్తి లక్ష్మణరావు కేసి చూసి.

"నీకోసమేరా వాజా! ఆడపిల్ల వెతుక్కుంటూ వచ్చి అడిగితే, నివ్వెరపోతా వేంరా నంగి-నీ కోసమే!"

"నా కోసమా! వీల్లేదు. నిన్న నో అమ్మాయి. ఇవా ళో అమ్మాయి. అంతా రౌడీ మూక-దయచేసి మీరు వెళ్ళండి" అని రామ్మూర్తి ఛర్రున లోపలకు పోయాడు.

సరళ రెండు మూడు సార్లు పిలిచిందిగాని, రామ్మూర్తి పలకలేదు. చివరకు లక్ష్మణ రావును చూసి "మీరో పని చేస్తారూ?" అని అడిగింది నెమ్మదిగా.

"ఒక పనా! ఏం చెయ్యమన్నా చెయ్యడానికి సిద్ధంగా వున్నాను. సప్త సముద్రాలూ ఔపోసన పట్టమంటారా - భూమినీ, పర్వతాలనూ వేరుచెయ్య మంటారా?" అన్నాడు లక్ష్మణరావు ధాటీగా నించున్ని.

"భూమినీ పర్వతాలనూ వేరు చెయ్యండి" అన్నది సరళ సీరియస్‌గా. లక్ష్మణరావు మళ్ళీ మాట్లాడలేదు. నవ్వు దామనుకొంటే అదీ పలకలేదు. ఎట్లా లేచాడో అట్లాగే చతికిలపడ్డాడు.

"ఏమీ అఖర్లేదు-మీరు రామ్మూర్తిగారిని పిలిస్తే చాలు" అంది సరళ.

"ఇంతేనా?" అని లక్ష్మణరావు లోపలకు వెళ్ళి-ఇరవై నిమిషాల తర్వాత రామ్మూర్తిని లాక్కువచ్చాడు.


"ఇదిగో చూడండి. నా పేరు సరళ. నిన్న మీతో మాట్లాడిన అమ్మాయి పేరు వసంత. వసంత మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తోంది. మీరు లేకపోతే బ్రతకలేదు. ఇదిగో వుత్తరం. దీనికి సమాధానం పంపండి. లేదా, ఒక నిండు ప్రాణిని హత్యచేసిన వారవుతారు." అని తెచ్చిన ఉత్తరం అక్కడ పడేసి-సరళ చరచరా బయటకు నడిచింది. "సరళా" అంటూ లక్ష్మణరావు ఆమె వెంటపడ్డాడు.

రామ్మూర్తి వసంత రాసిన ఉత్తరం చదివాడు. అందులో నానా కవిత్వమూ వుంది. మామూలు ప్రణయ భాష అంతా ఉపయోగించింది. ఆ ఉత్తరం చదివిన వెంటనే కొద్దిగా మెత్తబడ్డట్టు కనిపించినా, అంతలోనే మళ్ళీ కోపం తెచ్చుకున్నాడు. "ఈ ఉత్తరాన్ని మా నాన్నకు చూపిస్తాను" అనుకున్నాడు - గట్టిగానే. ఈ మాట రామ్మూర్తి తండ్రి విన్నాడు కూడా. ఆయన అప్పుడే లోపలకు వస్తూ

"ఏ వుత్తరం?" అని అడిగాడు.

"ఈ వుత్తరం. ఎవరో వసంతట. కాలేజీ పిల్ల. నన్ను ప్రేమిస్తోందట. పళ్ళు రాలగొట్టించు నాన్నా" అని రామ్మూర్తి ఉత్తరం ఇచ్చాడు. ఆయన వుత్తరం అంతా చదివి - "గట్టి ఉత్తరమే. మరి నువ్వేం రాశావు?" అని అడిగాడు.

"నేను రాయడ మేమిటి నాన్నా- నువ్వెంటనే వెళ్ళి - ఆ పిల్లను కలుసుకుని - ఈ వ్యవహారాలు కట్టిపెట్టమని, జాగ్రత్తగా ఉండమని తిట్టిరా. అవసర మయితే ఆ పిల్ల



తం[డికి ఉత్తరం రాయి'' అన్నాడు రామ్మూర్తి.

"నాయనా రాముడూ! నువ్వు లోకం ఎరుగుదువుగాని - ఈ లోకం ఎరగవు. ఆడపిల్ల - నిన్ను [పేమిస్తోందిరా. ఈ ఛాన్సు అందరికీ వచ్చేదా? పైగా నిన్నెవత్తె [పేమిస్తుందిరా - నీ పేరూ, నువ్వూనూ. వలచి వచ్చిన వనిత చులకన అయిందట్రా నీ దృష్టిలో కూడా! ఏమైనా సరే, మీ యిద్దరికీ నే పెళ్లి చేయిస్తాను"అని రామ్మూర్తి తం[డి బయటకు నడిచాడు. "నాన్నా... నాన్నా... నా కీ పెళ్ళొద్దు. నా కీ పెళ్ళొద్దు. నాన్నా! నాన్నా!" అని అరిచి కుర్చీలో కూలాడు రామ్మూర్తి.

కొద్ది దినాలు గడిచాయి. లక్ష్మణరావు సరళ కోసం రోజూ ఆడపిల్లల హాస్టల్ చుట్టూ [పదక్షిణాలు చేస్తున్నాడు. రామ్మూర్తి తం[డి వసంతను కలుసుకున్నాడు. ఆ అమ్మాయి తం[డికి ఉత్తరం రాశాడు. ఆయనా, ఈయనా కలుసుకుని పెళ్లి విషయాలన్నీ మాట్లాడుకొన్నారు. కట్నాలూ, కానుకలూ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాలు వసంతకు తెలుసుగాని, రామ్మూర్తికి తెలియవు. పెళ్లి ఏర్పాట్లు ఘనంగా ఏర్పాటయినాయి.

ఒకనాడు వసంత, రామ్మూర్తిని హఠాత్తుగా పోస్టుఆఫీసు దగ్గర కలుసుకుంది.

"మీతో పనుంది. తప్పకుండా నాతో రావాలి" అంది వసంత.

"ఇదిగో వసంతా! నన్నెందు కిట్లా హింసిస్తున్నావు? నే నేం పాపం చేశాను? నా మానాన నన్ను [బతకనివ్వ వెందుకని? నన్ను వదిలిపెట్టు - ఈ రోడ్డు మీద ఇంతమంది తిరుగుతున్నారు. వాళ్ళ నెవర్నయినా పోయి [పేమించు!" అని భోరున ఏడవడం మొదలెట్టాడు.

"వూరుకోండి. ఇది పబ్లిక్ ప్లేసు. పార్కుకు పోదాం పదండి. అక్కడ ఏడుద్దురుగాని" అని వసంత, రామ్మూర్తిని పార్కులోకి లాక్కుపోయింది.

"ఇదిగో చూడండి - ఆ కోయిలలు ఎంత బాగా పాడుతున్నాయో - అటు చూడండి ఆ పక్షుల జంట ఎంత బావుందో" అన్నది వసంత కూచుంటూ.

"నన్ను ఏడవనీ మరి" అన్నాడు రామ్మూర్తి ఏడుపు మొహంవేసి.

"చూడండి. నన్ను మీ రెందుకని సందేహిస్తున్నారు! నేను మిమ్మల్ని ఎంతగా [పేమిస్తున్నానో మీకు తెలీదు. మీరు లేని నా జీవితం వృథాగదా సదా! నిజం రామ్; మనిద్దరం వివాహం చేసుకుంటే, హాయిగా చిలకా గోరింకల్లా వుంటాము. మీరంటే నాకు ఎంత ఆపేక్ష - ఎంత అభిమానం! ఎంత [పేమ! మిమ్మల్ని గుమ్మం కదలనివ్వను. ఎండ తగల్నీయకుండా అపురూపంగా చూసుకుంటాను. నన్ను కనికరించండి - నా రామ్" అన్నది వసంత అతని హృదయంమీద వాలిపోతూ.

రామ్మూర్తి కరిగాడు. నెమ్మదిగా ఆమె బుగ్గమీద చెయ్యివేసి నిమిరాడు. "ఆహా" అన్నాడు. అంతకంటె హాయిగా "ఆహా" అన్నది వసంత.

వసంతకూ, రామ్మూర్తికీ వివాహం జరిగిపోయింది. వసంత పొంగిపోయింది. రామ్మూర్తికూడా సంబరపడ్డాడు."[పేమంటే ఇంత తియ్యగా వుంటుందని తెలీదు నాకు" అనుకున్నాడు.

శోభనం మందిరంలో [పవేశిస్తూనే వసంత రామ్మూర్తిని గాఢంగా కావలించుకొని, ఉక్కిరి బిక్కిరి చేసేసి ముద్దు పెట్టుకుంది. "నా రామ్" అంది. ''నా కలలు పండాయి'' అంది. "నా నోములు ఫలించాయి" అంది. అతన్ని తీసుకుపోయి మంచంమీద కూచోపెట్టుకుని - పలు రకముల స్వీట్లూ తినిపించింది; అంతకంటె తియ్యని కబుర్లూ చెప్పింది.

"చూశారా రామ్! మీ కోసం నేను ఎంత [శమ పడ్డాను - ఎన్ని బాధలు పడ్డాను; ఇంక మనం హాయిగా, తియ్యగా..." అంటూ అతన్ని దగ్గరగా లాక్కుంది.

వసంత కాపరాని కొచ్చిన కొన్నాళ్ళకు: రామ్మూర్తి పెరట్లో రుబ్బుతూ రోలు ముందుకూచొని ఆయాసపడిపోతూ, చెమటలు కక్కుకుంటూ, ఎవర్నో ఇంగ్లీషులో తిట్టుకుంటూ పచ్చడి రుబ్బుతున్నాడు. వసంత చక్కగా చిలకల్లే ముస్తాబై వచ్చి అపురూపంగా, ఆప్యాయంగా, తన భర్తను చూసుకుని - "ఇంకా కాలేదా? తొందరగా కానీండి. అదయితే ఇంకా అన్నం వండాలి. సరే, నేను వెళుతున్నాను. బయట [ఫెండ్స్ వెయిట్ చేస్తున్నారు. సినిమాకు వేళవుతోంది. ఇల్లు జా[గత్త! పదవుతుందేమో నేను వచ్చేసరికి!" అంటూ వడివడిగా సాగిపోయింది వసంత.

రామ్మూర్తి వినపడకుండా నిట్టూర్చాడు వీధిగుమ్మంకేసి చూస్తూ. ఆ చూపులో అతనికి మూడు నిమిషాల అనంతరం లక్ష్మణరావు దొరికాడు - ఉషారుగా ఇంట్లోకి [పవేశిస్తూ.

"రామ్మూర్తీ - ఫరవాలేదులే. ఇట్లా కూచుంటా. చిన్న విషయం - పొద్దున్న నేను బస్సులో కూచుని [పయాణం చేస్తున్నాను. బస్సు చాలా రద్దీగా వుంది. నించున్న వాళ్ళల్లో - నాకు దగ్గరగా సరళ కూడా కనిపించింది. కనిపిస్తే..."

''కొంపతీసి సీటు ఇచ్చావేమిటి?" అన్నాడు రామ్మూర్తి అమాంతంగా అంత ఎత్తుకు ఎగిరి, పచ్చడి చేతుల్ని నెత్తికి పులుముకుంటూ!

## మద్య ప్రదేశ్

తలలో పేలు పడితే అవి పోవడానికి అద్భుతమైన మార్గం కనిపెట్టా డొకాయన.

ఆయన చెప్పినది :

"ఏం లేదు సార్. మంచి విస్కీగాని, [బాందీగాని ఓ పురిషెడు తీసుకుని నెత్తికి రాసుకోవాలి. ఆపైన ఓ గుప్పెడు గం[డ ఇసుక జుట్టునిండా జల్లుకోవాలి. ఓ గంటయే సరికి తలలో పేలు మద్యం తాగి కైపెక్కి అందుబాటులో ఉన్న రాళ్ళతో ఒకదాన్నొకటి కొట్టుకు ఛస్తాయి."